# గౌతమీగాథలు

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

## కోట గుమ్మం

**అది రాజమహేంద్రవరానికి ప్రాణంవంటి శృంగాటకం. అంటే సెంటరు- ఇప్పటికీ అది 'కోటగుమ్మమే' అయితే కోటెక్కడ? గుమ్మం ఎక్కడ?**

అక్కడ ఇప్పుడు సాక్షాత్కరించేవి- ఏమిటయ్యా? అంటే-మిఠాయి కొట్లు, హర్యానా దుప్పట్లు- అరటిపళ్ళంగళ్ళు. రైలు ప్రయాణీకుల పరవళ్ళు - మధ్యగా ఉరిమి చూచే 'ఆంధ్రకేసరి' నిలువెత్తు శిలావిగ్రహం- అన్నింటికీ శ్రీరామరక్ష!

పూర్వం- సుమారు ఏభై ఏళ్ళ కిందట. కుడిచేతి వైపు ఎత్తైన పెద్ద దిబ్బ మీద ఒకే ఒక ముసలి చింతచెట్టు. అది కింద నడిచే జనాన్ని చూడదు. పండిపోయిన తల పైకెత్తి దిగులుగా ఆకాశంవైపు చూసేది. అది, అక్కడ పెద్ద కోటదేవిడీ. పెద్ద పెద్ద ఇత్తడి గుబ్బల తలుపులు వంకదార అన్నీ ఎరుగునేమో? లేక వాళ్ళ అమ్మగాని అమ్మమ్మగాని కథలు కథలుగా చెప్పేదేమో? అది, తెరవెనక్కుపోయిన చాళుక్య రాజ్య జ్ఞాపకాలకు శిథిల చిహ్నం - మరచిన రెడ్డిరాజుల శీర్ణ పతాకం. స్వాతంత్ర్యయుద్ధంలో అక్కడి ధీరులు తిన్న లాఠీదెబ్బలకు సాక్షి!

తెలుగువాళ్ళ కలల్లో, పౌరవృద్ధుల కళ్ళల్లో- లోలోపలి కళ్ళల్లో వుంది. ఆ కోట - కోటంటూవుంటే ఆ కోటకు గుమ్మం అది!

అదిగో చూడు.

నన్నినారాయణభట్టూ, నన్నయ్యగారూ జరీ కాశ్మీర శాలువలు భుజంమీదనుంచి జారుతూండగా గంభీరంగా ఏదో తర్కించుకుంటూ లోపలికి వెడుతున్నారు. సేవకులు వంగి వంగి తప్పుకుంటున్నారు. 18 కట్టల మహాభారతం బరువుగా లోపలికి వెళ్ళి అక్కడ విడి ముసిముసి తెలుగు నవ్వులతో, మూడు పువ్వులుగా బయటకు వస్తున్నవి. ఇంకా ఆరుకాయలు కాలేదు.

ఇటు చూడు.

విభూతి ముద్రాంకిత ఫాలభాగంతో, మెడలో బంగరు రుద్రాక్ష తావళంతో శ్రీనాథుడూ పట్టు అంగరఖాతో ఫగిడీతో అమాత్య-ఠీవితో అన్నయ్యమంత్రీ వీరభద్రారెడ్డి దగ్గరనుంచి వస్తున్నారు కాబోలు శ్రీనాథుడు కుడిచేత్తో సవిలాసంగా పట్టుకున్న ఆ యినప గుండేమిటి? బాపురే! అది యినప గుండు కాదు, కాశీఖండం. రేపుదయానికి, లేకపోతే వారానికి, అది మల్లెచెండు కాబోతున్నది.

తెరజారింది— కల కరిగింది.

మళ్లా చూడు—

మెలికలుతిప్పి చుట్టిన బుట్టంత తెలుగు తలపాగా, నిలువునాబొత్తాల పొడుగుకోటు చుట్టు బెంగాలి పంచ. సూదుల్లా గుచ్చుకునే చూపులు— గుబురు కనుబొమ్మలు— ఉరిమి చూస్తూ నించున్నాడు, ఆ గుమ్మందగ్గర. కోట పోయింది. గుమ్మం మాత్రం పేరుకు నిలిచి ఉంది. రాజీలేని హుంకరింపు. కుడిచేయి పైకెత్తి తర్జని ఊపుతూ— ఊఁ. కదలరేం? పొండి మా తెలుగు నేల నుంచి— అని గర్జిస్తే— ఆ గుమ్మంలో నుంచి గుత్తుల గుత్తుల చాదస్తాలు, గుడ్డి ఆచారాలు, నిర్జీవ శాస్త్రవాదాలు, పలాయనం చిత్తగిస్తున్నాయి, ఆ గుమ్మంలో నుంచే దూసుకు రమ్మని, కొత్త వెలుగులను, సరికొత్త చైతన్యాన్ని రెండు చేతులతోను ఆహ్వానిస్తున్నాడు— ఆ వీరుడు! 1932 ప్రాంతం అనుకుంటాను.

బొబ్జీ సినిమా హాల్లో జ. రా. పరిషత్తు షోడశోపచార పూర్వకంగా ప్రారంభం అయింది.

నేనూ ఆంధ్రసాహిత్య పరిషత్తూ ఒక్క సంవత్సరంలో పుట్టాం. నాకు దానిమీద సోదరప్రేమ. అభిప్రాయ భేదాల మాటకేం గాని- అది ఆంధ్ర సాహిత్యానికి చేసిన సేవ ఏతన్మాత్రం కాదు. అపూర్వ శాసనాలు, అముద్రిత గ్రంథాలు సంపాదించింది. ఆంధ్రదేశ భాషాభిమానులందరికీ భారద్వాజాశ్రమంలా పనిచేసింది. వచ్చిన పని అయినట్టుంది. పటుత్వం తగ్గింది. వయసుడిగింది. కొత్త తరానికి భాష మీద, సాహిత్యం మీద తగిన రుచి కల్పించలేకపోయింది. వెనక్కి తిరిగింది.

'ఏఁగు'లో అరసున్న కలదా? లేదా?

'కందోయి'లో బిందు వెట్లు వచ్చినది?

వీటిని గురించి కట్టలు కట్టలు సభల్లో చదవడం మొదలెట్టింది. అమృతాంజనం ధర పెరిగిపోయింది. యువకుడు శ్రద్ధగా విన్నాడు, అంజలి బంధంతో అడిగాడు; అయ్యా, అవి అచ్చువేస్తే కావలసిన వారు చదువుకుంటారు, మా క్కావలసింది అది కాదు. తిక్కన తెలుగు సొగసు చెప్పండి, నన్నయ వచః శ్రీ వ్యాఖ్యానించండి. పాండురంగని గడుసుదనం రుచి చూపండి. అంటే ఆ మాట గాల్లో కలిసిపోయింది. సాహితీ సమితి పుట్టింది. అంటే పరిషత్తు పుట్టించింది.

చిత్రం! సాహితీ సమితి ముఖ్యులు చాలమంది ఎందుకో ఆ రోజు అక్కడ ఉన్నారు. తల్లావఝ్ఝల, మొక్కపాటి, ముద్దుకృష్ణ, దీక్షితులు, ఇంకా యువకు లెందరో!

వడ్డాది సుబ్బారాయుడుగారు అధ్యక్షులు- అప్పటికే వృద్ధులు, అధ్యక్షోపన్యాసం ఎవరో చదివారు. జాషువా నవ్యదృష్టి గల కవి అని యువకులకు అభిమానం కాని ఆయన కూడా ప్రేమ కవిత్వాన్ని వెక్కిరిస్తూ "ఎవరా అమ్మాయిని చూపుమయ్య" అని పద్యాలు చదివితే ఆశాభంగం చెందారు.

సభ చివరి కొచ్చింది. ఆధునికుల్లో ఎవరైనా మాటలాడ దలచుకుంటే రావచ్చు. అని ఒకరు ఆహ్వానించారు. శివశంకరశాస్త్రి వెళ్ళబోయి ముద్దుకృష్ణను పంపారు. ముద్దుకృష్ణలో మిరియంపా లెక్కువ. వెళ్ళి "నమస్కారం, ఈ అవకాశం వస్తుం దనుకోలేదు. వచ్చింది. మా ఉనికి గుర్తించారు. సంతోషం. మీ కున్న భాషాభిమానం కంటె మా కేమీ తక్కువ లేదు. మార్గంలోనే పేచీ. మనం అన్నదమ్ములం. మేం విడిపోయాం. మీకూ మాకూ పొసగదు. ఇప్పుడు నన్నయ, శ్రీనాథుడు బతికివుంటే తప్పక మాతో వుండేవారు. వారికి సాహిత్వంలో చైతన్యం కావాలి. శవాలంకరణ అక్కర లేదు." అని కూచున్నాడు.

అదే కోటగుమ్మంలోంచి తెలుగు కవిత్వంలో చాదస్తం తలవంచుకు వెళ్ళిపోయింది.

అందులోంచే గౌతమీ తరంగాహ్వానాలతో నవ్యభావం, ఉజ్జీవం, రాజరాజు పట్టణంలో ఠీవిగా ప్రవేశించాయి.